నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్ నారాయణపేట

3 | మహబూబ్‌నగర్, ఆదివారం 2 జూన్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

కొవ్వొత్తుల ర్యాలీలో జిల్లా నేతలు

రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని అమరవీరుల స్తూపం వద్ద కేసీఆర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యా లీ నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్‌తోపాటు పలువురు హాజరయ్యా రు. ఆయా జిల్లాల నుంచి వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అ భిలాశ్‌రావుతోపాటు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నాయ కులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. అంతకుముందు అమర వీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు.

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మహబూబ్‌నగర్ కలెక్టర్

ఉత్కంఠ

నేడే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్

- పాలమూరు బాలుర కళాశాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు
- నిఘా నీడలో.. బందోబస్తు మధ్య ప్రక్రియ
- పర్యవేక్షించిన మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్
- గెలుపు ధీమాలో బీఆర్ఎస్
- ఓటమి భయంలో కాంగ్రెస్

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వివరాలు..

ఎన్నిక జరిగిన తేదీ : మార్చి 28

మొత్తం ఓట్లు : 1439

పోలైన ఓట్లు : 1437

10 కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ

ప్రధాన పార్టీల అభ్యర్థులు

బీఆర్ఎస్ : నవీన్‌కుమార్ రెడ్డి

కాంగ్రెస్ : మన్నె జీవన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : టిక్.. టిక్.. టిక్.. అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్.. మరికొన్ని గంటల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఎవరో తేలనున్నది. రెండు నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఎమ్మెల్సీ పీఠం ఎవరికి దక్కుతుందోనని అధికార పార్టీతోపాటు బీఆర్ఎస్ నేతలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లా స్థానిక ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీగా ఉన్న కశిరెడ్డి నారాయణరెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ మారడం.. కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఈ స్థానం ఖాళీ అయ్యింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాం గ్రెస్ అధికారం చేపట్టాక జరుగుతున్న తొలి ఎన్నిక కావడం తో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే శాసనసభ ఎన్నికలు పూర్తయినా.. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలింగ్ తర్వాత కౌంటింగ్ నిలిపివేశారు.

పాలమూరు బాలుర కళాశాలలో..

దాదాపు 66 రోజుల తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం తేలనున్నది. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపును అధికారులు చేపట్టనున్నారు. నిఘా నీడలో లెక్కింపు కట్టుదిట్టమైన భద్రత మధ్య కొనసాగనున్నది. జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి రవినాయక్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించడంతోపాటు అంతకు ముందే ప్రక్రియపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రాధాన్యతా క్రమంలో ఓట్ల లెక్కింపు నిర్వహిస్తుండడంతో జాగ్రత్తగా అన్ని బ్యాలెట్ పత్రాలను పరిశీలించి ఓట్ల లెక్కింపును చేపట్టాలని సూచించారు. కాగా ఎమ్మెల్సీ ఎన్నిక ఇటు బీఆర్ఎస్‌కు.. అటు కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. అధికార మార్పిడి జరిగిన తర్వాత తొలి ఎన్నిక కావడంతో అధికారపక్షం ఈ ఎన్నికలు సవాల్‌గా తీసుకొని ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి తీరాలని ప్రలోభాలకు సైతం వెనుకాడలేదన్న ఆరోపణలున్నాయి. మరోవైపు ఉమ్మడి జిల్లాలో దాదాపు 90 శాతం మంది బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఉండడం.. వీరిని పెద్ద ఎత్తున కొనుగోలు చేసి పార్టీలు మార్చడం వంటివి చేసినా మెజార్టీ ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ వైపే ఉన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎమ్మెల్సీ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకొని ప్రజాప్రతినిధులందరూ ఆత్మ ప్రబోధం ప్రకారం ఓటేయాలని సూచించారు. కాంగ్రెస్‌ను ఓడించి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మరోవైపు సీఎం రేవంత్ సొంత జిల్లా కావడంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిపాలైతే రాజకీయ పరిణామాలు మలుపు తి రిగే అవకాశాలు ఉన్నాయి. మరో రెండ్రోజుల్లో పార్లమెంట్ ఫలితాలు కూడా ఉండడంతో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకున్నది.

నేడే కౌంటింగ్..

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ ఆదివారం జరగనున్నది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం కలెక్టర్ రవినాయక్ పాలమూరు లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభంకానున్నది. సిబ్బంది ఉదయం 6:30 గంటలకు కౌంటింగ్ కేంద్రంలో రిపోర్టు చేయాల్సి ఉన్నది. టేబుల్స్ వద్ద కేటాయింపు చేసిన కౌంటింగ్ సిబ్బంది లెక్కింపు చేపడతారు. ఉదయం 7:30 గంటలకు స్ట్రాంగ్‌రూం తెరిచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్‌హాల్‌కు తీసుకెళ్లనున్నారు. మొత్తం ఓట్లను లెక్కించి కట్టలు కడతారు. ఆ తర్వాత లెక్కింపు చేపడతారు. పోలైన ఓట్లకు.. బ్యాలెట్ బాక్స్‌లో ఉన్న పత్రాలను సరిచూసిన తర్వాత కౌంటింగ్ ప్రక్రియ మొదలుకానున్నది.

ప్రాధాన్యతా క్రమంలో లెక్కింపు..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యతా క్రమంలో ఓటర్లు ఓటేస్తారు. అందుకే కౌంటింగ్‌లో భాగంగా మొదట ప్రారంభ లెక్కింపు చేపడుతారు. కౌంటింగ్ కోసం ఐదు టేబుళ్లను ఏర్పాటు చేశారు. ప్రారంభం లెక్కింపులో మొత్తం 10 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లను, వచ్చిన బ్యాలెట్ పేపర్లను లెక్కిస్తారు. అనంతరం మొత్తం చెల్లుబాటైన ఓట్ల సంఖ్య ఆధారంగా గెలుపు కోసం కావాల్సిన కోటాను నిర్ధారిస్తారు. అనంతరం మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరుగుతుంది. మొదటి ప్రాధాన్యత ప్రకారం ప్రతి అభ్యర్థి సాధించిన ఓట్లను లెక్కించి, మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ఎవరైనా అభ్యర్థి కోటాకు సరిపడా ఓట్లను సాధిస్తే అభ్యర్థి గెలుపొందినట్లుగా ప్రకటిస్తారు.

ఏ అభ్యర్థి కోటాకు కావాల్సిన ఓట్లు రాకుంటే ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టి తదుపరి ప్రాధాన్యత క్రమం ఆధారంగా ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఈ ప్రక్రియ ఏదేని అభ్యర్థి కోటాను సాధించేవరకు చేపడతారు. ఏ అభ్యర్థికీ కోటా రానట్లయితే చివరికి మిగిలిన అభ్యర్థి గెలుపొందినట్లుగా ప్రకటిస్తారు.

శాసనమండలి ఉపఎన్నిక కాంగ్రెస్‌కు పరీక్షగా మారింది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత వచ్చిన తొలి ఎన్నిక కావడంతో అందులో సీఎం సొంత జిల్లా కావడం ఆ పార్టీకి సవాల్‌గా మారిందని చెప్పొచ్చు. అయితే స్థానిక ప్రజాప్రతినిధుల సంఖ్యాబలంలో మాత్రం కాంగ్రెస్ కన్నా బీఆర్ఎస్‌కే ఎక్కువ మంది ఉన్నారు. దీంతో కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల్లో గెలవాలనే ఉద్దేశంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార పక్షం మొత్తం స్థానిక ప్రజాప్రతినిధులను ప్రలోభపట్టే కార్యక్రమంలో మునిగిపోయిందన్న సమాచారం. దీనికి తగ్గట్టు ఆ పార్టీ ప్రముఖ వ్యాపారవేత్తను అభ్యర్థిగా ప్రకటించింది. రూ. కోట్లు ఖర్చు పెట్టయినా ఎమ్మెల్సీగా గెలవాలన్న లక్ష్యంతో పని చేశారన్న విమర్శలున్నాయి. ఆ పార్టీ క్యాండిడేట్ స్థానిక ప్రజాప్రతినిధులను ఇతర రాష్ట్రాల్లో విహారయాత్రలకు తీసుకెళ్లి రూ.లక్షల ఖర్చు పెట్టినట్లు తెలిసింది. కాగా, ఉన్న ఓట్లలో చాలామంది క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారు. దీంతో ఆ పార్టీకి గెలుపుపై అవకాశాలు సన్నగిల్లాయి. చివరివరకు ప్రయత్నాలు చేసినా ఏం జరుగుతుందో కౌంటింగ్ తర్వాతే తేలనున్నది.

బీఆర్ఎస్ గెలిస్తే రాజకీయాల్లో మలుపు

మహబూబ్‌నగర్ శాసనమండలి ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్‌రెడ్డి గెలిస్తే రాష్ట్ర రాజకీయాలపై తీవ్ర ప్రభావం పడనున్నది. సీఎం సొంత జిల్లాలో బలమైన అభ్యర్థిని ఓడించిన ఘనత గులాబీ పార్టీకే దక్కుతుంది. అధికారం కోల్పోయి.. కొన్నాళ్లకు అదే పార్టీ నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఓటు వేసే ఎన్నిక కావడంతో గ్రామస్థాయిలో ప్రభావం పడుతుంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం.. ఇతర కారణాలతో కాంగ్రెస్ ఓడిపోతే రాజకీయాలు మలుపు తిరిగే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే అదునుగా సీఎం పీఠం కదిలి అభ్యర్థి మారినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదంటున్నారు.

మహబూబ్‌నగర్ కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు

జబర్దస్త్ కిస్తీ..

- మత సామరస్యానికి ప్రతీక షా–అలీ పహిల్వాన్ ఉర్సు : అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- పెద్ద కిస్తీల్లో పాల్గొన్న పహిల్వాన్లు
- ప్రసాదం కోసం భక్తుల పోటీ

ప్రసాదం కోసం పోటీ పడుతున్న భక్తులు

అలంపూర్, జూన్ 1 : వందల ఏండ్లుగా హిందూ ముస్లింలు ఐకమత్యంతో మత సామరస్యానికి ప్రతీకగా ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. ఉత్సవాలకు ఎమ్మెల్యేతోపాటు హజ్ యాత్ర కమిటీ చైర్మన్ కుద్రుబాషా బియామానీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అలంపూర్‌లో షా అలీ పహిల్వాన్ ఉర్సులో భాగంగా మూడో రోజైన శనివారం ఆలయాల సముదాయంలోని పెద్ద దర్గా వద్ద భక్తి శ్రద్ధలతో పెద్ద కిస్తీ నిర్వహించారు. ఉర్సు నిర్వాహకులు సయ్యద్ సలీమొద్దీన్ అమ్మద్ ఖాద్రీ, ఓవైస్ అమ్మద్ షాద్రీ, ఖాదర్‌వలీ ఇంటి నుంచి సర్కార్ కిస్తీ నుంచి వేలాదిగా తరలివచ్చారు. పహిల్వాన్ విన్యాసాలు, బల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉర్సు సందర్భంగా పరిసర ప్రాంతాల్లో చిరు దుకాణాలు, ఆట వస్తువులు, రంగురాట్నాలు వెలిశాయి. కార్యక్రమంలో ఉర్సు కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫకీర్లు తదితరులు పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అలంపూర్ సీఐ రవిబాబు ఐదుగురు ఎస్సైలు, 100 మంది పోలీసులతో కలిసి బందోబస్తులో పాల్గొన్నారు.

దట్టీల ఊరేగింపు..

ఉర్సును పురస్కరించుకొని పట్టణంలో దట్టీల ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలో పటాన్ వీధి, అక్బర్‌పేట నుంచి తెల్లవారుజామున బయలుదేరిన దట్టీలు పురవీధుల్లో పహిల్వాన్ల బలప్రదర్శనలతో ఉభయ దర్గాల్లో ప్రార్థనల తర్వాత యథాస్థానానికి చేరుకున్నాయి. పెద్దదర్గా చేరుకున్న తర్వాత పట్టణంలో భక్తులు, డ్రైవర్ యూనియన్లు, కులసంఘాల నాయకులు ఎద్దుల బండ్లు, ఆటోలు, ఇతర వాహనాలపై ప్రసాదాన్ని ఊరేగింపుగా మేళతాళాలు, డప్పుల మధ్య తీసుకొచ్చి కిస్తీలో సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ప్రసాదాలను తీసుకొచ్చారు. కాగా, పంపిణీకి సిద్ధంగా ఉంచిన ప్రసాదం వద్ద (రాతిపడవ) మత పెద్దలు, ఉర్సు నిర్వాహకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కిస్తీ నుంచి పహిల్వాన్లు విసిరేసే ప్రసాదాన్ని చేజిక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. ఉత్సవాలను తిలకించేందుకు స్థానికులేకాకుండా పక్క జిల్లాలు, రాష్ట్రాల

ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు, మత పెద్దలు

ఇసుక కోసం ఈత చెట్లకు నిప్పు



వెంకటాయపల్లిలో కాలిపోయిన ఈతచెట్లు

- కాలిబూడిదైన 150 చెట్లు

దేవరకద్ర, జూన్ 1 : గీతా కార్మికుల ఆర్థికాభివృద్ధి కోసం గ్రామాల్లోని చెరువు కట్టలపై, వాగు సమీపంలో కేసీఆర్ ప్రభుత్వం హరితహారంలో భాగంగా ఈత చెట్లను నాటించింది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. దేవరకద్ర మండలంలోని వెంకటాయపల్లి సమీపంలోని 74 సర్వేనెంబర్‌లో కేసీఆర్ ప్రభుత్వంలో 200కు పైగా ఈత మొక్కలను నాటగా, ప్రస్తుతం 150 చెట్లు ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇసుక మాఫియా శుక్రవారం అర్ధరాత్రి ఇసుక కోసం ఈతచెట్లకు నిప్పుపెట్టి కాల్చివేసింది. ఈత చెట్లను కాల్చడంతో గీతా కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

ఈ విషయం గురించి అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈతచెట్లను కాల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.